క్లుప్తంగా

19న పాదయాత్ర

నూతనకల్ : తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఈ నెల 19న చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల నాయకుడు గడ్డం యాదగిరి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19న తుంగతుర్తి మండలం కొత్తగూడెంలోని దళిత బహుజన నాయకుడు మారోజు వీరన్న స్మారక స్థూపం వద్ద నుంచి హైదరాబాద్ వరకు చేపట్టే పాదయాత్రలో ఉద్యమకారులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పంతం యాకయ్య, జానయ్య, కొమరమల్లు, వాసు తదితరులు పాల్గొన్నారు.


పీసీసీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా పద్మ



సునీతారావు నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న వేములకొండ పద్మ

భానుపురి : పీసీసీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడకు చెందిన వేములకొండ పద్మ నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం బంజారా హిల్స్‌లో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ తన నియామకానికి కృషిచేసిన ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పీసీసీ సభ్యులు కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఫణిగిరి బౌద్ధ క్షేత్రం వంద చిత్రాల ప్రదర్శన



ప్రదర్శనలో ఉంచనున్న శిరంశెట్టి ఆనందరావు గీసిన చిత్ర పటం

సూర్యాపేట : ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని వంద చిత్రాలతో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన చిత్రకారుడు శిరంశెట్టి ఆనందరావు హైదరాబాద్‌లో ప్రదర్శించనున్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆర్ట్ ప్రదర్శన, ఆర్ట్ పుస్తకావిష్కరణ చేయనున్నారు. పేద రైతు కుటుంబంలో పుట్టిన ఆనందరావు బాల్యం ఫణిగిరిలో సాగింది. అనంతరం సూర్యాపేటకు చేరుకుని ఉన్నత విద్యను పూర్తి చేశాడు. చిన్నతనం నుంచే చిత్రకళలో తన ప్రదర్శనలతో సత్తా చాటుతూ వస్తున్నాడు. ప్రముఖ దిన పత్రికల్లో కార్టూన్‌లు, ముఖచిత్రాలు, కథల చిత్రాలు వేసి ఎంతోమంది మెప్పు పొందాడు. ఆరు నెలలుగా ఫణిగిరి సైట్‌ను శోధించి బుద్ధుడి చరిత్ర ద్వారా ఫణిగిరి కొండపై బౌద్ధ భిక్షుల జీవన విధానంపై వందకు పైగా చిత్రాలు గీశారు. ఈ చిత్రాలను చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించనున్నారు.

వీరమ్మ మృతికి సంతాపం

సూర్యాపేట : మండల పరిధిలోని తాళ్లఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్ ముదిరెడ్డి సంతోష్ రెడ్డి నాయనమ్మ, ముదిరెడ్డి రమణారెడ్డి మాతృమూర్తి ముదిరెడ్డి వీరమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఆమె మృతదేహానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మధుమేహం, క్షయ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు

పెన్‌పహాడ్ : మండలంలోని పొట్లపహాడ్ గ్రామంలో మధుమేహం, క్షయ వ్యాధులు గుర్తించిన కుటుంబాల నుంచి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నమూనాలను సేకరించారు. శుక్రవారం ఈ సందర్భంగా హెచ్‌ఈఓ భూతరాజు శ్రీనివాస్ మాట్లాడారు. వ్యాధుల నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలు ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ లింగాల రాజు, దుర్గ, లక్ష్మి, సబిత, జహంగీర్‌బీ, రాధ, లలిత తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

తుంగతుర్తి : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని రవీందర్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో సంకినేని రామారావు- కమలమ్మల జ్ఞాపకార్థం సంకినేని కృష్ణారావు బ్రదర్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్ల గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ పోటీల నిర్వాహకులు బండి నవీన్, మదూరి రమేష్, బొంకూరి మధు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



సూర్యాపేట టౌన్ : శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



సూర్యాపేట టౌన్ : ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

సూర్యాపేటటౌన్ : ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి వేడుకలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ ఆవరణలో ప్రత్యేకంగా వైకుంఠ మందిరాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారిని భక్తులు ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. ఉదయం నుంచే దేవాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్, డీఈ సత్యారావు, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, బూర సతీష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉండ్రుగొండలో లక్ష తులసీ దళార్చన

చివ్వెంల : వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉండ్రుగొండ శివారులోని శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష తులసీ దళార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ మనోహర శర్మ, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలగిరి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగనాథ స్వామి వారు భక్తులకు ఉత్తర ద్వార దర్శమిచ్చారు. అర్చకులు రఘునందన్ భక్తుల గోత్రనామాలపై అర్చనలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకల్లో ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి రామచంద్రస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. వేడుకల్లో పూజారి కాటూరి రామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : ముక్కోటి ఏకాదశి వేడుకలను మండల వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాలతోపాటు మండల వ్యాప్తంగా పలు దేవాలయాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. జాజిరెడ్డిగూడెం దేవాలయంలో ఉత్తర ద్వారదర్శన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామిని గరుడవాహనంపై ఉంచి ఊరేగించారు. అలాగే భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు జక్కర్తి శ్రీనివాసులు, బ్రహ్మయ్య, అమీన్‌సింగ్, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, ఆనంద్‌దీక్షితులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, భక్తులు దాసరి సోమయ్య, బింగి కృష్ణమూర్తి, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, సుతారపు సోమశేఖర్, పెద్ది శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్ : శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు



సూర్యాపేట : శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



చివ్వెంల : లక్ష తులసీ దళార్చన పూజలు..



తిరుమలగిరి: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..



తుంగతుర్తి : శ్రీరామచంద్రస్వామి ఆలయంలో..



ఆత్మకూర్(ఎస్): చెన్నకేశవ స్వామి ఆలయంలో..

క్షేత్రస్థాయి పర్యవేక్షణతో మెరుగైన సేవలు

• ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేటటౌన్ : క్షేత్ర స్థాయి పర్యవేక్షణతో ప్రజలకు పోలీసుల సేవలను సమర్థంగా అందించవచ్చని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులు, కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. డివిజన్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ గురించి సమీక్షించారు. రౌడీషిటర్స్, అనుమానితులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. కేసులు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఆయన వెంట డీఎస్పీ రవి, సీఐలు వీరరాఘవులు, రాజశేఖర్, ఎస్ఐలు తదితరులు ఉన్నారు.

ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్ల ఆవిష్కరణ



భానుపురి : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి : ఈ నెల 18వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించే రెండు ఐఎఫ్‌టీయూల విలీన సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. శుక్రవారం సూర్యాపేటలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలీన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దాసరి శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, సహాయ కార్యదర్శి దేశోజు మధు, హమాలీ యూనియన్ నాయకులు ఒగ్గు వెంకన్న, చంద్రశేఖర్, వెంకన్న, పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి పాల్గొన్నారు.

నూతనకల్ : ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల విలీన సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలీన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 18న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించే సభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు మున్నా అశోక్, మూరగుండ్ల మధు, రవి, శ్రీను, వెంకన్న, దేవేందర్, రవి, సందీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు ఇవ్వాలి



ఏఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భానుపురి : భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (ఎంసీపీఐయూ) రాష్ట్ర అధ్యక్షుడు వరికుప్పల వెంకన్న, పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు కలెక్టరేట్ ముందు వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా ఈ పథకానికి అర్హులను గుర్తించాలన్నారు. తక్షణమే విధివిధానాల రూపకల్పనకు వ్యవసాయ కార్మిక సంఘాలతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాసాని కిషోర్, బోయిల్ల నవీన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సోమపంగా జానయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, నల్ల మేకల అంజయ్య, జంపాల స్వరాజ్యం, నాయకులు కేశగాని భద్రయ్య, వెలుగు మధు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



వైద్యాధికారి స్రవంతికి వినతిపత్రం అందజేస్తున్న నెమ్మాది వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు

పెన్‌పహాడ్ : ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, వారి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్‌లో నిర్వహించిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఏఎన్ఎంలుగా ప్రమోట్ చేయాలన్నారు. వచ్చే నెలలో జరుగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం వైద్యాధికారి స్రవంతికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రణపంగ కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి వీరబోయిన రవి, ఆశా వర్కర్లు బచ్చలకూర రమాదేవి, జ్యోతి, సుజాత, నీల, రమణ, త్రివేణి, నాగమణి, గోవర్ధన, కనకమ్మ, ఇందిరా పాల్గొన్నారు.

25 నుంచి సీపీఎం మహాసభలు

తుంగతుర్తి : సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. శుక్రవారం తుంగతుర్తి మండలంలోని కొత్తగూడెంలో సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో రాష్ట్ర మహాసభలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, పులుసు సత్యం, పార్టీ సీనియర్ నా యకురాలు తాటి విజయమ్మ, లింగయ్య, లచ్చయ్య, యాదగిరి, సోమయ్య, మల్లయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు ప్రాధాన్యం

అర్వపల్లి : ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు అన్నారు. జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాసోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఉచిత విద్యుత్, బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, గ్యాస్ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, సీనియర్ నాయకుడు గుడిపల్లి సోమిరెడ్డి, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, కొప్పుల సత్తిరెడ్డి, కుంభం సత్తయ్య, నిమ్మల నిరంజన్, తాటికొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి

అర్వపల్లి : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తయినట్లు ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ గోపి తెలిపారు. శుక్రవారం అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం తది తర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సూపర్‌చెక్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్‌రెడ్డి, బిల్ కలెక్టర్ సాయిని యాగానందం, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ తిరుమలగిరి పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి

తిరుమలగిరి : భారతీయ జనతా పార్టీ తిరుమలగిరి పట్టణ శాఖ అధ్యక్షుడిగా మేకల శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. తిరుమలగిరి మండల శాఖ అధ్యక్షుడిగా తొండ గ్రామానికి చెందిన వేల్పుల బంగారాజు రెండోసారి నియమితులయ్యారు.

16 నుంచి 27వ తేదీ వరకు కంటి పరీక్ష శిబిరాలు

సూర్యాపేట : ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు కంటి పరీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట కంటి హాస్పిటల్ చైర్మన్ దోసపాటి గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వుప్పల రాజేంద్రప్రసాద్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న నేరేడుచర్ల, 20న నర్సింహులగూడెం, 23న చివ్వెంల, 27న చెరుకుపల్లిలో క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్యాంపులో ఆపరేషన్ అవసరం ఉన్న పేషంట్లకు ఉచితంగా ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించడంతోపాటు ఓపీ, బ్లడ్ టెస్ట్‌లు, రూ.10వేల విలువ గల ఉచిత సర్జరీ సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే లంచ్, డిన్నర్ ఉంటుందని తెలిపారు. గత 40 ఏళ్లుగా లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో 2351 ఉచిత కంటి పరీక్ష శిబిరాలు నిర్వహించినట్లు తెలియజేశారు. ఇప్పటివరకు మొత్తం 5,84,096 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అలాగే 52,844 మందికి ఉచితంగా రక్త పరీక్షలు, కంటి ఆపరేషన్‌లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. లేజర్ ద్వారా కుట్లు లేకుండా శుక్లంల ఆపరేషన్లు, అమెరికన్ కంటి అద్దాలు అమర్చి అతి తక్కువ ధరలో ఆపరేషన్ చేస్తున్నట్లు తెలిపారు.

గీత కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

• ఎమ్మెల్యే మందుల సామేల్



తుంగతుర్తిలో గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి : గీత కార్మికుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహిస్తుందని అన్నారు. గీత కార్మికులను ప్రోత్సహించడానికి నియోజకవర్గంలోని ఆయా మండలాల గీత కార్మికులకు 275 కాటమయ్య కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ డీసీఎంఎస్ డైరెక్టర్ గుడిపాటి సైదులు, నూతనకల్ సింగిల్ విండో చైర్మన్ జయసుధ, తహసీల్దార్ పి. దయానంద్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జి.అనసూర్య, ఎంపీడీఓ శేషు కుమార్, బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ గామయ్య, ఎక్సైజ్ సీఐ రజిత, మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, జిల్లా నాయకులు సుంకరి జనార్దన్, నల్లు రాంచంద్రారెడ్డి, రేగటి రవి, దాసరి శ్రీను, రేగటి వెంకటేష్, గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపూరి శ్రీకాంత్ గౌడ్, తుంగతుర్తి పట్టణ అధ్యక్షుడు ఉప్పుల రాంబాబు, ఎక్సైజ్ సిబ్బంది, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో వేషధారణల్లో విద్యార్థులు



తిరుమలగిరి : కృష్ణవేణి పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో, తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముగ్గులు వేశారు. జాజిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు హరిదాసుల వేషధారణలో అలరించారు. ఈ వేడుకల్లో హెచ్‌ఎంలు కుంభం ప్రభాకర్, కె. చినవెంకట్‌రెడ్డి, జి. ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణవేణి పాఠశాలలో..

తిరుమలగిరి : మండల కేంద్రంలోని కృష్ణవేణి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో..

చివ్వెంల : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.



మద్దిరాల : సేయింట్ పీటర్స్ పాఠశాలలో..



ఆత్మకూర్(ఎస్) : ప్రాథమిక పాఠశాలలో..

మద్దిరాల : మండల పరిధిలోని గ్రామాల పాఠశాలల్లో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. మండల కేంద్రంలోని సేయింట్ పీటర్స్ పాఠశాలలో విద్యార్థులు రంగు, రంగుల ముగ్గులు వేశారు. హరిదాసుల వేషధారణల్లో అలరించారు. ఈ వేడుకల్లో ఎంఈఓ తండు వెంకటనారాయణగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నూతనకల్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాములు నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్యా భారతి పాఠశాలలో..

తుంగతుర్తి : మండల కేంద్రంలోని శ్రీ విద్యా భారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మల్లయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే సంక్రాంతి వేడుకల గురించి నేటితరం చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ముందస్తుగా తమ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు.



చివ్వెంల : తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వేసిన ముగ్గులు



నూతనకల్ : మండల కేంద్రంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



తుంగతుర్తి : శ్రీవిద్యా భారతి పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు